అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలు ఆవిష్కరణ

కోదాడ రూరల్, మార్చి 8 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్, దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవితాలు ఆదర్శనీయం, అనుసరణీయమని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి గుడిబండలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పందితిరుపతయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్, మార్చి 8 : తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ప్రాజెక్టుల కాల్వల ద్వారా నీళ్లు రాకపోవడంతో సూర్యాపేట జిల్లాలో లక్షలాది ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని, ఎండిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ కాల్వ పరిధిలో పొలాలు పొట్ట దశలో ఉన్నాయని వెంటనే నీటిని విడుదల చేయాలన్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. సూర్యాపేట జిల్లాలో అనేక మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించాలన్నారు. అలాగే రైతాంగానికి కాంగ్రెస్ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అమలు చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు, చేతి వృత్తిదారులను ఆదుకునేందుకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. తక్షణమే ఆరు గ్యారెంటీ స్కీంలను అమలు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట గోపి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా హక్కుల సాధనకు పోరాడుదాం

- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేణుక

నేరేడుచర్ల : మాట్లాడుతున్న రేణుక

నేరేడుచర్ల, మార్చి 8 : నేటి సమాజంలో రోజు రోజుకు అణిచివేయబడుతున్న మహిళల హక్కుల సాధన కోసం పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం నేరేడుచర్లలో పీఓడబ్ల్యూ నియోజకవర్గ కన్వీనర్ సందా సత్తమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్‌తో కలిసి హాజరై మాట్లాడారు. నేటి పాలకులు శ్రామిక వర్గ స్ఫూర్తిని మరచి మహిళా దినోత్సవాన్ని కేవలం ఒక ఉత్సవం లాగా మార్చివేయడం జరిగిందన్నారు. అందుకే ప్రగతిశీల మహిళా సంఘం ఇలాంటి వాటిని వ్యతిరేకిస్తుందన్నారు. కార్మిక వర్గ స్ఫూర్తితో సమానత్వం, సమాన వేతనం, పని గంటలు తగ్గించాలని, మహిళా సాధికారత కోసం అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కన్వీనర్ వాస పళ్లయ్య, పీఓడబ్ల్యూ నాయకులు మరియమ్మ, మాలాంబి, ఫాతిమా, సుమలత, శ్యామల, లక్ష్మి, నాగమణి, లావణ్య, బుచ్చమ్మ, జాన్సి, నమ్రత పాల్గొన్నారు.

కంఠమహేశ్వరుడికి జలాభిషేకం

జల బిందెలతో ఆలయానికి తరలివెళ్తున్న గౌడ కులస్తులు

బొడ్రాయిబజార్, మార్చి 8 : కంఠమహేశ్వరస్వామి, సురమాంభ దేవి కల్యాణ మహోత్సవాన్ని సూర్యాపేట పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఘనంగా నిర్వహిస్తున్నది. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల్లో రెండో రోజు శుక్రవారం జల బిందెలు తీసి స్వామి అమ్మవార్లకు అభిషేకం, పంచామృత స్నానం, పుష్పాదివాసం, ఫలాదివాసం, వస్త్ర అలంకరణ నిర్వహించారు. పట్టణంలోని గౌడ కులస్తులంతా కుటుంబ సమేతంగా స్థానిక గీత పనివారల భవనం నుంచి డప్పు చప్పుళ్లు, నృత్యాలతో ర్యాలీగా జల బిందెలు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. శనివారం సాయంత్రం బోనాలు తీయడం, భక్త సూరమాంబ దేవి నాటకం, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాపర్తి పెద్ద శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు ఎల్గూరి గోవింద్, ప్రధాన కార్యదర్శి గునవంటి కృష్ణ, కోశాధికారి కెక్కిరేణి సత్యనారాయణ, డైరెక్టర్లు బొమ్మగాని మారయ్య, పాడిశెట్టి వెంకన్న, ఐతగోని జనార్దన్, ఎల్గూరి లక్ష్మమ్మ, కప్పల శశిరేఖగౌడ్ పాల్గొన్నారు.

టిప్పర్ దూసుకెళ్లడంతో తండ్రీకొడుకు మృతి

అర్వపల్లి, మార్చి 8 : మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో పండగపూట విషాదం నెలకొన్నది. టిప్పర్ ఢీకొట్టడంతో తండ్రి కొడుకు అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లంపల్లి గ్రామానికి చెందిన గద్దగూటి జానయ్య (38) తన చిన్న కుమారుడు విఘ్నేశ్ (12)తో కలిసి ఇంటి సమీపంలోని ఐకేపీ సెంటర్‌లో పిల్లలు క్రికెట్ ఆడుతుండగా పక్కన చిన్న కంకర కుప్పపై కూర్చోని ఆటను చూస్తున్నాడు. అదే సమయంలో గ్రామానికే చెందిన డ్రైవర్ బొడ్డు శేఖర్ మద్యం మత్తులో టిప్పర్‌ను ఆట స్థలంలోకి తీసుకువచ్చి ఇష్టానుసారంగా తిప్పుతున్నాడు. ఈ క్రమంలో పక్కన కూర్చున్న జానయ్యపైకి టిప్పర్ వేగంగా వస్తుండడంతో కుమారుడితో లేచి వేళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే టిప్పర్ ఇద్దరి మీదకు దూసుకెళ్లింది. దాంతో తండ్రి కొడుకులు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాములు తెలిపారు.

ఆలయ పునరుద్ధరణకు విరాళం

నాగారం, మార్చి 8 : మండల కేంద్రంలోని శివాలయ పునరుద్ధరణకు దాతలు గుండా వెంకన్న, నీల శ్రీనివాస్ రూ.20 వేల విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు బొబ్బిలి లింగమల్లు మాట్లాడుతూ.. దాతల సహకారం అభినందనీయమన్నారు. కమిటీ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటభిక్షం, మంగదుడ్ల దశరథ, సోమయ్య, శివాజీ, మల్లేశ్, సైదులు, మల్సూర్, ఉపేందర్ పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పూజలో పాల్గొన్న ఎమ్మెల్యేలు పద్మావతిరెడ్డి, మందుల సామేల్

తిరుమలగిరి : జలాల్‌పురం మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మేళ్లచెర్వు : జాతీయ స్థాయి ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మేళ్లచెర్వు, మార్చి 8 : మహా శివరాత్రి వేడుకలు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వైభవంగా జరిగాయి. శివనామ స్మరణతో ఆలయాలు మారుమోగింది. జంగమయ్యను కొలిచేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే బారులుదీరారు. శివ స్తుతి, శైవ కీర్తనలతో ముక్కంటిని కొలుస్తూ సాగే వేద మంత్రోచ్చారణలతో అర్చక పండితులు శివరాత్రి పర్వదినానికి ఆహ్వానం పలికారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివుడికి భక్తులు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. మహిళలు మారేడు చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

మేళ్లచెర్వు జాతర ప్రారంభం

మేళ్లచెర్వు మహా శివరాత్రి జాతర ప్రారంభమైంది. మేళ్లచెర్వు స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి అభిషేక పూజల నిర్వహించారు. రామదూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రాగి జావ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జాతీయస్థాయి ఎద్దుల పందేలను ఆమె ప్రారంభించారు. తొలి రోజున రెండు పళ్ల విభాగంలో పోటీలు జరిగాయి. సాయంత్రం విద్యుత్ ప్రభల ఊరేగింపు జరిగింది. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, జడ్పీ సీఈఓ అప్పారావు, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కృషి ఫౌండేషన్ చైర్మన్ పోశం నర్సిరెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్రకుమార్, ఈఓ గుజ్జుల కొండారెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక భావం అలవర్చుకోవాలి

తిరుమలగిరి/తుంగతుర్తి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావం అలవరుచుకోవాలిని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండల పరిధిలోని జలాల్‌పురంలో గల ప్రాచీన మల్లికార్జున ఆలయాన్ని అలాగే తుంగతుర్తి మండల కేంద్రంలోని పురాతన శివాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివయ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ సందర్భంగా తుంగతుర్తి తాజా మాజీ సర్పంచ్ సంకినేని స్వరూప రవీందర్‌రావు రోడ్డు విస్తరణ కార్యక్రమం గురించి ఎమ్మెల్యేతో చర్చించగా వ్యాపారస్తులకు ఇబ్బంది లేకుండా పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, కాంగ్రెస్ తుంగతుర్తి మండలాధ్యక్షుడు దొంగరి గోవర్ధన్, ఓరుగంటి సత్యనారాయణ, రామ్మూర్తి, అజయ్‌కుమార్, పులి పంపుల సైదులుగౌడ్ పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో..

సూర్యాపేట రూరల్ : పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో పురాతన శివాలయాల్లో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పటేల్ రమేశ్‌రెడ్డి దంపతులు, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పూజలు చేశారు. కౌన్సిలర్ బచ్చల కూరి శ్రీనివాస్, శివాలయ కమిటీ చైర్మన్ కొట్ల సైదులుగౌడ్, శివాలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

సోమప్ప ఆలయంలో..

నేరేడుచర్ల : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్త ఆలయాలు శివ నామస్మరణలతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారి దర్శన కోసం బారులు తీరారు. అతి పురాతన చరిత్ర కలిగిన నేరేడుచర్ల మండలంలోని సోమప్ప సోమేశ్వర దేవాలయంలో భక్తులు స్వామివారి దర్శన కోసం పోటెత్తారు. ఆలయ సమీపంలోని పవిత్ర మూసీ నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు.

సూర్యాపేట రూరల్ : పిల్లలమర్రి శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

నేరేడుచర్ల : సోమప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సీఐ చలమంద రాజు, ఎస్ఐ రవీందర్ నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ

బొడ్రాయిబజార్ : ఉమామహేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చివ్వెంల : ఉంట్రుగొండలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : పిల్లలమర్రి ఎరుకేశ్వరాలయంలో బారులుదీరిన భక్తులు

మునగాల : స్వామి కల్యాణానికి తులం బంగారం పుస్తెలు అందజేస్తున్న మునగాల సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ

మఠంపల్లి మండల కేంద్రంలోని స్వామి వారి ఊరేగింపు

మేళ్లచెర్వు : శివాలయంలో దర్శనానికి బారులు తీరిన భక్తులు

నాగారం : నాగారంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు

గరిడేపల్లి : కేతవారిగూడెం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెన్‌పహాడ్ : నాగులపహాడ్ శివాలయంలో స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఆత్మకూర్.ఎస్ : ఏపూరు మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

గరిడేపల్లి : గడ్డిపల్లి కేవీకేలో మహిళలను సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు

సూర్యాపేట అర్బన్ : బస్టాండ్ కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న సూరారపు పరీక్షణ్‌రాజ్

హుజూర్‌నగర్ రూరల్ , మార్చి 8 : మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో మహిళలతో కలిసి కేక్ కట్ చేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనంతరం మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఎంపీడీఓ లావణ్య, కాంగ్రెస్ నాయకులు శివారెడ్డి, కిరణ్మయి పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆసరా సొసైటీ నిర్వాహకుడు బోద లక్ష్మీచక్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్‌లో కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ పరమేశ్ పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్ : మహిళలు అన్ని రంగాలలో రాణించాలని మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. బాలభవన్‌లో బ్యూటీ పార్లర్స్ అసోసియేషన్ సభ్యులు మున్సిపల్ చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ.. మహిళలు ఐకమత్యంగా ఉండి మహిళా సాధికారత సాధించాలన్నారు. స్థానిక హైటెక్ బస్టాండ్ ఆవరణలో బస్టాండ్ మహిళా కార్మికులకు ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూరారపు పరీక్షణ్‌రాజ్ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆప్ సూర్యాపేట మండలాధ్యక్షుడు మిద్దె బాబురావు, బ్యూటీపార్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మన్నెం పద్మావతిరెడ్డి, ఉమా, రోజా, శ్రామిక మహిళా అధ్యక్షురాలు యాకలక్ష్మి, బాలభవన్ సూపరిండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతులు, ఉపాధ్యాయురాళ్లను ఎంపీటీసీ మేకల స్రవంతీశోభన్‌బాబు, జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం నళిని, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్.నరేశ్, ఎ.కిరణ్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎంపీపీ గుండగాని కవితారాములుగౌడ్‌ను బీఆర్ఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, గోపగాని రమేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

నాగారం : ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని డి.కొత్తపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా నాయకురాలు బయ్యజయమ్మ మాట్లాడుతూ.. స్త్రీ, పురుష సమానత్వంకై పోరాడాలన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు స్వర్ణ సుజాత, అనూష, వెంకటమ్మ, మల్లమ్మ, భిక్షమమ్మ, పూలమ్మ, ఉపేంద్ర, సైదమ్మ, పద్మ, పాల్గొన్నారు.

బొడ్రాయిబజార్ : నేడు పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఆప్ జిల్లా అధ్యక్షుడు ఇందారపు రాజమల్లయ్య అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయా రంగాలకు చెందిన పలువురు మహిళలను ఘనంగా సన్మినించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కెళ్లపల్లి శ్యామ్‌సుందర్, మహిళా అధ్యక్షురాలు జులూరి మమత, జిల్లా కార్యదర్శి గ్యార అంజయ్య, కోశాధికారి మెరుగు విక్రమేందర్, జాయింట్ సెక్రటరి నరసింహ పాల్గొన్నారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 8 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని శుక్రవారం కోదాడ రూరల్ పోలీసులు సీజ్ చేశారు. ఆంధ్ర నుంచి హైదారబాద్‌కు అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా మండల పరిధి గుడిబండ శివారు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పట్టుకున్నారు. డ్రైవర్ గోపి, యాజమాని కె.సాంబశివరావుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

తిరుమలగిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తాటిపాముల గ్రామంలోని బిక్కేరు వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా తిరుమలగిరికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని యజమాని ననుబాల యాదగిరి, డ్రైవర్ ననుబాల హరీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతులు లేకండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

ఆడ పిల్లలను చదివించాలి

- టీఎస్ఎస్పీ మెంబర్ రజినికుమారి

బొడ్రాయిబజార్, మార్చి 8 : తల్లిదండ్రులు ఆడ పిల్లలను చదివించాలని, విద్య ద్వారానే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యురాలు పాల్వాయి రజినికుమారి అన్నారు. గురువారం రాత్రి స్థానిక బ్రాహ్మణ కల్యాణ మండపంలో హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధూ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు దైద వెంకన్న అధ్యక్షతన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పలువురు మహిళలకు శక్తి పురస్కారాలు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి గణేశ్, ఇరిగి కోటేశ్వరి, హమీద్‌ఖాన్, అంజనేయులు, రోజా, చింతలపాటి చిన శ్రీరాములు పాల్గొన్నారు.

దిర్శించర్లలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

దిర్శించర్లలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల, మార్చి 8 : క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందని ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని దిర్శించర్లలో గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బహుమతుల దాత ప్రార్థనబోయిన నాగరాజు, బుర్రి శ్రీను, కాంగ్రెస్ మండల కార్యదర్శి పడిగపాటి సైదిరెడ్డి, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రాపోలు మహేశ్, బుర్రి శ్రీను, క్రీడల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా యోగానందుడి డోలోత్సవం

అర్వపల్లి, మార్చి 8 : అర్వపల్లి యోదానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ విఖనస మహర్షి అర్చన డోలోత్సవాన్ని నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లను శేష వాహనంపై అదిష్ఠింపజేసి ఊయల ఊపుతూ స్వామి అమ్మవార్లను నిద్రబుచ్చారు. కార్యక్రమంలో అర్చకులు రాంబాబు, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.